మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం


"ఓ నెలరోజులు అలా వెళ్లొద్దామండీ" అంది సరోజిని సిగలో మల్లెదండ సర్దుకుంటూ.

"నువ్వెళ్లు" అన్నాడు రామం కళ్లజోడు ముక్కు మీదకు జార్చి. కొడుకు, కూతురు రమ్మని అంటారుగానీ మనింట్లో ఉండకుండా ఎక్కడికో వెళ్లడం నాకు కుదరదు అంటాడు రామం.

"ఎక్కడికో ఏమిటి మన పిల్లల దగ్గరికే" అంటుంది సరోజిని.

"సరే...నువ్వెళ్లు. నేను వద్దన్నానా?" అన్నాడు రామం.

"మిమ్మల్ని వదిలి నేను వెళ్లనని మీకు తెలుసు. అదీ గడుసుదనం" అంది భార్య సరోజిని.



# నిశ్శబ్ద స్వర్గం

-డా.ముక్తేవి భారతి

సరోజిని చాలా మాటకారి. అందరినీ పలకరించి మాట్లాడడం మహా ఇష్టం. మాటమాటకీ సంభాషణ పొడిగించడంలో నేర్పరి. 'పిన్నిగారు భలే సరదాగా మాట్లాడతారు అనీ, అక్కయ్యగారు మీరుంటేనే సందడి అని ఇరుగుపొరుగు అంటుంటే సరోజినికి ఆనందమే. హాయిగా నవ్వుతూ అందరితోనూ మాట్లాడాలిగానీ అలా మూతి బిగించుకోవడం నాకు రాదు అంటుంది.

పాలవాడిని, పనిమనిషిని, కూరలమ్మిది... ఇలా అందరి కష్టసుఖాలు కావాలి సరోజినికి. రామం ముభావంగా ఉండేవాడయినా సరోజిని కబుర్లు వింటూ హాయిగా భోజనం చేస్తాడు. ఇంటికి ఎందరొచ్చినా సంతోషంగా వండి వడ్డిస్తుందని మనసులో గర్వపడుతుంటాడు రామం.

"ఏమిటీ?'' అని పేపరు చదువుకుంటున్న రామంతో-

"'ఏమిటేమిటి కూతుర్ని, కొడుకుని చూసి వద్దామంటుంటే''

"సరే'' అన్నాడు రామం.



## అజయ్ ఔదార్యం

అజయ్‌దేవ్‌గన్ సొంతంగా తీస్తున్న ఓ సినిమా షూటింగ్ ఇటీవల జరుగుతున్నప్పుడు బిపాషా బసు మొబైల్ ఫోన్ మిస్సయిందిట. ఎంత వెదికినా కనిపించకపోయేసరికి బిపాషాకన్నా ఎక్కువగా అజయ్ తెగ వర్రీ అయిపోయాట్ట. తన చిత్రం షూటింగ్‌లో ఫోను పోగొట్టుకోవడం సుతరామూ నచ్చని అజయ్ వెంటనే బ్లాక్‌బెర్రీ ఫోన్‌ని కొనేసి బిపాషాకి గిఫ్ట్‌గా ఇచ్చేశాట్ట. అజయ్ ఔదార్యానికి బిపాషా కూడా బోల్డు ఇదైపోయిందిట.




సరోజిని ముఖం ఆనందంతో నిండిపోయింది.

***

కూతురింటికి రాగానే వీధిలో మనవడు స్కూటర్ స్టార్ట్ చేస్తూ "హాయ్ అమ్మమ్మా, తాతయ్యా'' అన్నాడు.

బ్రేక్‌ఫాస్ట్, భోజనం అన్నీ ఒకదాని తరువాత ఒకటి పూర్తయ్యాయి. ఏమిటో ఇల్లంతా నిశ్శబ్దం. అల్లుడు బ్యాంక్‌కు వెళ్లక రాత్రి ఎనిమిదింటికి గానీ రాడు. అమ్మాయి తనలాగే గలగలా మాట్లాడేది. కానీ అదీ మాటలు తగ్గించేసింది ఎందుకో!

భోజనాలయ్యాక "అమ్మా! మీరీ గది వాడుకోండి. బాబిని నా గదిలో పడుకోమంటాలే'' అంది కూతురు. ఆ తరువాత ఓ పుస్తకం తీసుకుని తన గదిలోకి వెళ్లిపోయింది.

"అదేమిటే పొద్దున్ననగా వెళ్లిన పిల్లాడు ఇంకా ఇంటికి రాలేదు'' అంది కంగారుగా సరోజిని కూతురితో.

"వస్తాడు ఇంకో గంటకు. కాలేజీ నుంచి ట్యూషన్‌కు వెళ్లి రావాలిగా'' అంది టిఫిన్ ప్లేటు చేతికందిస్తూ.

ఆదివారం మనవడు ఇంట్లోనే ఉన్నాడు. మామా అల్లుడు రాజకీయాల గురించి పదినిముషాలు మాట్లాడుకున్నారు.

"ఒరేయ్ బాబీ ఇటురా'' అంది సరోజిని మనవడితో. వచ్చి అమ్మమ్మ పక్కన కూర్చున్నాడు.

"అవునుగానీ అంత రాత్రి పగలు కష్టపడి చదువుతున్నావుకదా. స్టేట్ ర్యాంక్ వస్తుందా?'' అంది అమ్మమ్మ.

వాడు ఫెళ్లున నవ్వి "యమ్‌సెట్ క్వాలిఫై అవుతానా అని భయపడి ఛస్తున్నాను?'' అన్నాడు.

"అదేమిటి... అంత డబ్బు ఖర్చు చేసి మీ అమ్మ ట్యూషన్లు పెట్టి చదివిస్తుంటే?'' బాబీకి అప్పటికే విసుగొచ్చేసింది. లేవబోయాడు.

"కూర్చో. అవునుగానీ నీ సెకెండ్ లాంగ్వేజ్ తెలుగేనా?' అంది.

"హిందీ'' అన్నాడు వాడు.

"అదేమిటిరా... మన మాతృభాష నేర్చుకోకుండానూ'' అంది అమ్మ.

అంతలో బాబీ అదృష్టంకొద్దీ సెల్ మోగింది. క్షణంలో ఆ గదిలోంచి బయటకు వచ్చేసాడు.

***

"అబ్బ...ఏమిటమ్మా అమ్మమ్మ బోర్.. ఎన్ని ప్రశ్నలు అడుగుతుందో, ఎంత మాట్లాడుతుందో బాబోయ్'' అన్నాడు తల్లితో.

సుధ నెమ్మదిగా అంది "నేను అంతకంటే బాగా ఎక్కువ మాట్లాడే దాన్ని. మీ నాన్న నా నోరు నొక్కేసారు. ఆయన మితభాషి. నేనూ అలా ఉంటేనే ఆయనకు ఇష్టం. ఇప్పుడు మాట్లాడాలన్నా మాటలు రావడం లేదు'' అంది నిట్టూరుస్తూ. బాబీ అక్కడ లేడు.

***

సరోజినికి చాలా చిరాగ్గా ఉంది. ఇది పెట్టే బ్రేక్‌ఫాస్ట్, భోజనమా నాకు కావలసింది? అమ్మా అని దగ్గర కూర్చుని మాట్లాడడంగానీ, వాళ్లాయనకి ప్రమోషన్ ఎప్పుడు వస్తుందో చెప్పడంగానీ... పోనీ ఈ కూర బావుందా? ఈ గుడికి వెళదామా అనిగానీ... అదేమిటీ.. పూర్తిగా అలా అయిపోయింది. అతనికి ఇష్టం లేదేమో మేము రావడం? ఆ మాట చెప్పలేకనా ఇంత ముభావం! సరోజిని మనసు చాలా వికలమైంది. చిరాకు పడింది సుధను చూసి.

"రేపు అబ్బాయి దగ్గరకెళదామండీ" అంది భర్తతో.

"పదిహేనురోజులన్నావు. మరి ఇంకా వారం కూడా కాకుండానే..." రామం నవ్వాడు.

***

కొడుకు కోడలు స్టేషన్‌కొచ్చారు. కారు డ్రైవర్ వీళ్ల సామాన్లు కారులో సర్దారు.

"నా కోసం సెలవు పెట్టావుటరా? ఎందుకూ... నేనూ నాన్నా వచ్చేయగలంగా" అంది కొడుకుతో.

"ఇవాళ నాకు సెలవేలే" అన్నాడు మురళి.

ఇంటి ముందు కారు ఆగగానే పనిమనిషి సామాన్లు పట్టుకుని ముందుకు నడిచింది.

"అత్తయ్యా.. ఇది మీ గది. ఇదిగో ఏసీ స్విచ్. రిమోట్ ఇక్కడే ఉంది. మీరు సీరియల్స్ హాయిగా చూసుకోండి. మామయ్యా... మీకోసం ఇంగ్లీషు మ్యాగజైన్లు తెచ్చాను. ఇక్కడ యాష్ట్రే పెట్టాను" కోడలు శాంతి అంటుంటే ఎంతో ఆనందపడిపోయింది సరోజిని.

"మనకోసం ఎన్ని ఏర్పాట్లు చేసిందో చూసారా?" అంది టీవీ చూస్తున్న భర్తతో.

"ఇది వాళ్ల గెస్ట్ రూం" అన్నాడు రామం నవ్వి.

"అంటే?"

"అంటే వాళ్లింటికి ఎవ్వరైనా అతిధులు వచ్చినా, మరెవ్వరైనా బంధువులు వచ్చినా ఈ గది వాళ్లకిస్తారు" అన్నాడు రామం యాష్ట్రేలో సిగరెట్టు పొడి దులుపుతూ.

"అంటే మనమిప్పుడు గెస్టులమా?" అంది సరోజిని ముఖం వెలవెలపోయిందో క్షణం.

***

రామం ఆనందంగా పుస్తకాలు తిరగేస్తున్నాడు.

కోడలు శాంతి కంప్యూటర్ ఎదురుగా కూర్చుంది. మనమరాలు ఫ్రెండ్ ఇంటికి వెళ్లింది. కొడుకు ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. సరోజినికి ఏమీ తోచడంలేదు. వంటింటింట్లోకి వెళ్లింది. అప్పటికే వంటమనిషి వంట చేస్తోంది.

"ఈరోజు నేను వంకాయ కూర చేస్తాను. మా వాడికి ఇష్టం" అంది.

వంట మనిషి వినిపించుకోనట్లే వూరుకుంది తన పని తను చేసుకుంటూ. అంతలో గబగబా వంటింట్లోకి వచ్చింది శాంతి.

"అత్తయ్యా! మీరు దాన్ని డిస్టర్బ్ చేయకండి. దానికి ఒక్క క్షణం తీరిక లేదు. అది మాట్లాడదు ఎవరితోనూ" అంది విసుగ్గా.

"అబ్బాయికి..." ఏదో అనబోయింది సరోజిని.

"వెళ్లండత్తయ్యా. ఏ రోజు ఏం చేయాలో అక్కడ కాగితం ఉంది. మీరు కల్పించుకోకండి."

శాంతి మాటలకు క్షణం విస్తుపోయి సరోజిని తన గదిలోకి వెళ్లిపోయింది. వంటమనిషి మాట్లాడదా? పనిమనిషి మాట్లాడదా? ఇదేదో చిత్రంగానే వుందే అని మనసులో మధనపడ్డా బైటికి తేలకుండా వూరుకుంది అప్పటికి.


రెండురోజులయ్యాయి. నిశ్శబ్దం... భరించ లేకపోతోంది సరోజినీ. కోడలు ఒక్క మాట కూడా సరదాగా మాట్లాడదు. మనమరాలు దగ్గరకే రాదు. ఇంట్లో ఉన్నంతసేపూ సెల్‌ఫోన్! నాతో ఒక్క మాట మాట్లాడవచ్చుగా... సరోజినికి ఉన్నట్టుండి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

భోజనానికి కూడా 'మీరు మామయ్య తినేయండి. మేము తరువాత తింటాం' అంటుంది కోడలు. ఇదేమిటి ఎక్కడుంది పొరపాటు? మాటేకదా మనిషికి శక్తినిచ్చేది, మనిషిని బ్రతికించేది.

***

ఆ రోజు కాలింగ్ బెల్ మోగుతుంటే సరోజిని గబుక్కున వెళ్లి తలుపు తీసింది. భార్యా భర్త, నాలుగేళ్ల పిల్లాడు, శాంతి ఫ్రెండ్స్. మనుష్యుల్ని చూసేసరికి చాలా ఉత్సాహం వచ్చింది సరోజినికి. శాంతి లోపల్నించి వచ్చింది. సరోజిని అక్కడే సోఫాలో కూర్చుని ఏ ఊరు మీది? అంది. ఆ తరువాత విజయవాడ మా పుట్టిల్లు అక్కడే అంది. అలా మాటా మాటా కలిపి మాట్లాడుతుంటే శాంతికి చాలా చిరాగ్గా ఉంది.


"నా గదిలో కూర్చుందాం రా" అని స్నేహితురాలిని తన గదిలోకి తీసుకెళ్లింది శాంతి. సరోజిని తన గదిలోకి వచ్చేసింది.




## చెవులతో బస్సు లాగిన సాహసి

వెస్టెస్టర్ ఐరన్ మేన్‌గా పేరు పొందిన 59 సంవత్సరాల మంజిత్‌సింగ్ ఇటీవల లండన్‌లో తన చెవులతో ఒక డబుల్ డెక్కర్ బస్సును లాగి గిన్నిస్ బుక్ రికార్డుకెక్కాడు. 1977లో ఇంగ్లండ్‌కు వెళ్లిన మంజిత్‌కి 1986లో అతని స్నేహితుడు గిన్నిస్ బుక్ బహుమతిగా ఇచ్చాడుట. అప్పట్నుంచి అనేక సాహసాలు చేసి తరచూ గిన్నిస్ బుక్‌లోకి ఎక్కడం అతనికి పరిపాటయిపోయింది. అతి త్వరలోనే బోయింగ్ 747 విమానాన్ని కూడా తన చెవులతో లాగి మరో రికార్డు స్థాపిస్తానంటున్నాడు.

-తటవర్తి



"చూసారా! ఆ అమ్మాయిది విజయవాడేనట. ఆ పసివాడు ఎంత ముద్దుగా ఉన్నాడో" అంది భర్త రామంతో.

రామం ఏమీ అనకుండా గుమ్మంవైపు నుంచి చూపు మరల్చుకోలేకపోయాడు. గుమ్మంలో శాంతి.

"ఇంటికొచ్చిన వాళ్లతో మీరు అలా కల్పించుకుని మాట్లాడం బావుండదు. నాకు నచ్చదు. మీ గదిలో మీరుండాలిగానీ..." విసురుగా వెళ్లిపోయింది శాంతి. సరోజినికి అర్థంకాలేదు. తను చేసిన తప్పేమిటో... ఇంటికొచ్చిన వాళ్లతో మాట్లాడకూడదా? కళ్లల్లో తిరిగిన నీళ్లు రహస్యంగా తుడుచుకుంది.సరోజినికి ఎంతకీ అర్థంకాలేదు. మాట్లాడకపోవడం అనేది... మాట్లాడడంలో ఎంత ఆనందం ఉందీ, ఎంత ఆప్యాయత ఉందీ, మనసు విప్పి మాట్లాడుతుంటే ఎంత హాయిగా ఉంటుంది...!

మనసు చాలా వికలమైపోయింది సరోజినికి. మాట్లాడకపోవడం ఫ్యాషన్‌లో భాగమా? గొప్పవాళ్ల లక్షణమా? ఇదీ ప్రపంచీకరణలో ముఖ్యాంశమా? తల పగలగొట్టుకున్నా సమాధానం దొరకలేదు. సరోజిని ఇల్లాలు మాత్రమే కాదు, ఇరవై ఏళ్లకుపైగా బ్యాంక్‌లో ఉద్యోగం చేసి విశ్రాంతి తీసుకుంటున్న ఉద్యోగిని.

రామం అంతా గమనిస్తున్నాడు. భార్య మాట కాదనలేకనే వచ్చాడు.

***

రాత్రి భర్తతో అంది సరోజిని 'రేపు వెళ్లిపోదాం' అని.

రామం నవ్వి "నేను రాను. ఇంకో వారం రోజులాగి వస్తాను" అన్నాడు.

"సరే మీరు ఉండండి. నేను వెడతాను" అంది. సరోజిని గొంతు బొంగురుపోయింది.

"ఈ రాత్రే వెళ్లిపోదాంలే" అన్నాడు భార్య చెక్కిళ్లు నిమిరి రామం. నెరసిన జుట్టులో వెండి తీగలు నవ్వుతున్నాయి ఆ క్షణం.

***

సరోజని రాగానే పక్కింటి శారద వచ్చేసింది.

"పిన్నీ! మీరు ఇవాళేగా వచ్చారు. ఈ పూట మా ఇంట్లోనే భోజనం" అంది. సరోజని ముఖంలో ఆనందం.

"అక్కయ్యగారూ... మీరు లేకపోతే సందడేలేదు" అంది పక్క వాటాలో రాధమ్మ.

"అమ్మమ్మా.. మన జామచెట్టు కాయలన్నీ నాన్న కోసేసాడు. అమ్ముతాడుట. నాకు ఒక్కటీ ఇవ్వలేదు" పనిమనిషి రంగి కొడుకు.

"పోన్లే నేను నీకు కొనిపెడతాను. జామకాయలు కొని తెచ్చుకో, హాయిగా తిను" పర్సు తీసి డబ్బులు వాడి చేతిలో ఉంచింది సరోజిని.

సరోజని హాయిగా ఊపిరి తీసుకుంది. దొడ్లో మల్లెపూలు విరబూసాయి. అన్నీ కోసి తెచ్చింది రంగి. పెద్ద మాల కట్టింది సరోజిని.

"ఇదిగో నీకు, ఇది నాకు" అంటూ మాల తుంచింది.

పక్కింట్లో రాధ గబగబా వచ్చి "అక్కయ్యా! సాయంత్రం సినిమాకెళదాం. మా పెద్దాడు టిక్కెట్లు కొంటానన్నాడు" అంది సరోజినితో.

"ఇదిగో రాధా దీనిక్కూడా తీసుకోమను. నేను డబ్బిస్తాలే" అంది నవ్వుతూ.

తననీ సినిమాకు తీసుకెళుతున్నందుకు మురిసిపోయింది రంగి.

రామం గోడ దగ్గర నిలబడి పక్కింటి సుబ్బారావుతో రాజకీయాల గురించి మాట్లాడుకుంటున్నారు.

"అన్నయ్యగారూ! ఇద్దరూ లోపలకు వచ్చి కబుర్లు చెప్పుకోండి వేడి వేడి కాఫీ తాగుతూ" అంటూ సరోజని కాఫీ కప్పులు బల్లమీద ఉంచింది.


***

ఆదివారం సాయంత్రం శారద, సరోజిని కలసి సరోజిని ఇంట్లో కూర్చుని చెస్ ఆడుకుంటున్నారు. రామం క్లబ్‌కు వెళ్లిపోయాడు.

ఆ మాటా ఈమాటా అయ్యాక "అవునుగానీ...అంత దూరం వెళ్లారు. ఎప్పుడూ ఇల్లు కదలరుకదా. ఓ నెలరోజులు ఉండకపోయారా?" అంది శారద. సరోజిని ఫక్కున నవ్వింది.

"ఆ నిశ్శబ్ద స్వర్గంలో ఉండలేకపోయాను. ఇంట్లో అన్నీ ఉంటాయి. మనిషి మనిషితో మాట్లాడకపోతే ఎలా? తిండి ఒక్కటేనా మనిషికి కావాల్సింది? ఆ తిండి మన ఇంట్లో లేదా? ఆ నిశ్శబ్దం భరించలేకపోయాను వదినా. అందుకే ఉండలేకపోయాం. నేను మాటలు మర్చిపోతాననుకున్నా" అంది గలగలా నవ్వుతూ సరోజిని.

★



## శ్వేత 'స్పీడ్'

'కొత్త బంగారులోకం'లో నటించిన శ్వేతాబసు ప్రసాద్‌కు ఆఫర్ల మీద ఆఫర్లు వచ్చిపడుతున్నాయి. ఆమె రెండో చిత్రం 'రైడ్' హిట్టయింది. ఇక మూడో చిత్రంగా 'స్పీడ్' రాబోతోంది. దీంతో ఆమె కెరీర్ మరింత స్పీడందుకుంటుందని సినీజనాలు అంచనాలు వేస్తున్నారు. శ్వేత టాలీవుడ్‌లో మరో జెనీలియాలాగా రూపొందే అవకాశాలున్నాయంటున్నారు. ఓ వైపు జెనీలియా తెలుగు సినిమాల్ని తగ్గించుకుంటూ హిందీవైపు మొగ్గు చూపిస్తోంది గాబట్టి శ్వేతకి కలిసొచ్చే కాలంగానే చెప్పాలి.

